క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మండపేట: మండలంలోని ఏడిదలో సోమవారం జరగనున్న రథోత్సవాన్ని పురస్కరించుకొని చుట్టు పక్కల గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు రత్నాలరావు, శ్రీధర్ తెలిపారు. ఏడిద సీతానగరం, ఏడిద సావరం, ఏడిద కొత్తూరు గ్రామాలతో పాటు ఏడిద రోడ్డులోని వ్యవసాయ మోటార్లు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాను మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. రథోత్సవం సంగమేశ్వర ఆలయం వద్దకు చేరుకున్నాక తొలగించిన విద్యుత్ లైన్లను తిరిగి పునరుద్ధరిస్తామని చెప్పారు. స్వామివారి ఊరేగింపు సందర్భంగా కలుగుతున్న అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ధన ధాన్యలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



నూతన ఆలయంలో ప్రతిష్ఠింపబడిన అమ్మవారు

కె.గంగవరం: మండల పరిధిలోని కోట ప్రధాన రహదారి చెంత నిర్మించిన నూతన ఆలయంలో ఆదివారం ధన ధాన్యలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా వారం రోజుల నుంచి ఆలయం వద్ద పలు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు నిర్ణయించిన ముహూర్తానికి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ మహోత్సవంలో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీపీ పంపన నాగమణి తదితరులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధి వారిలంకలో వెలసిన శ్రీధనమ్మతల్లి మర్రి క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఆయా గ్రామాలవారితో పాటు రావులపాలెం, కొత్తపేట, అయినవల్లి, కె.గంగవరం మండలాల భక్తులు క్షేత్రాన్ని సందర్శించారు. మహిళలు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారిని విశేషంగా అలంకరించారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

మండపేట: వైఎస్సార్ సీపీ పట్టణ నాయకుడు శిరంగు శ్రీనివాస్‌ను ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. మాతృ వియోగంతో విషాదంలో ఉన్న ఆయన నివాసానికి ఆదివారం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల విభాగం చైర్మన్ పిల్లి శ్రీనివాస్, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పెంకే గంగాధర్, దేవస్థానం మాజీ చైర్మన్లు సూరంపూడి సత్యప్రసాద్, లేగా వెంకన్న తదితరులు వెళ్లి పరామర్శించారు.

పీడీఎఫ్ అభ్యర్థి గెలుపునకు సహకరించండి

కపిలేశ్వరపురం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులు గెలుపు ఆవశ్యకతను గుర్తించాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు కె.కృష్ణవేణి అన్నారు. డీవీ రాఘవులును గెలిపించాలని కోరుతూ అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని ఓటర్లను కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో నోటికొచ్చిన హామీలు ఇచ్చిందని, 9 నెలల పాలనా కాలంలో వాటిని పక్కన పెట్టిందన్నారు. ఇదే వైఖరిని భవిష్యత్‌లోనూ కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని, పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించుకుంటే పోరాటాల్లో ముందు నిలుస్తారన్న విషయాన్ని ఓటర్లు గుర్తించాలని కోరారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కాజులూరు: కాజులూరు మండల గ్రామాలలో ఆదివారం ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా స్థానిక నేత, రాష్ట్ర మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు కాజులూరు, చేదువాడ, గొల్లపాలెం తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా తిప్పరాజుపాలెం, అయితపూడి, అండ్రంగి, కోలంక, ఉప్పుమిల్లి తదితర గ్రామాలలో పీడీఎఫ్ బలపరచిన అభ్యర్థి దిడ్ల రాఘవులుకు మద్దత్తుగా ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు ఆధ్వర్యంలో రైతు సంఘాల నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాలలో పర్యటించి ఉపాధ్యాయులను, పట్టభద్రులను కలుసుకుని తమ అభ్యర్థికి తొలి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా..!

- 8వ వార్డులో సమస్యల పరిష్కారానికి చొరవ చూపని నాయకులు
- కౌన్సిల్‌లో ముగ్గురు కౌన్సిలర్లు ఈ వార్డుకు చెందినవారే
- అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని స్థానికుల డిమాండ్



రహదారిపై మట్టిని తప్పించుకుంటూ వస్తున్న స్కూల్ ఆటో



ప్రధాన రహదారిలో డివైడర్‌కు కట్టేసిన విద్యుత్ స్తంభం

రామచంద్రపురం: అధికారుల నిర్లక్ష్యంతో అటు ప్రజాధనం దుర్వినియోగం కావటంతో పాటు ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తున్న వైనం పట్టణంలో చోటు చేసుకుంటోంది. చిన్నపాటి నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలుగా మారుతున్న సంఘటనలు నిత్యం కోకొల్లలు. పైప్‌లైన్‌ల కోసం గుంతలు తవ్వేసి వదిలేయటం.. ప్రమాదాలు సంభవించిన తరువాత ఎలక్ట్రికల్ పోల్స్‌ను అలానే వదిలేయటం, రోడ్డు మీదనే ఇసుక గుట్టలు వేయటం.. ఇలా పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్నా మున్సిపాలిటీ అధికారులు మిన్నకుండడంతో పట్టణ ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పురపాలక సంఘం పరిధిలోని 8వ వార్డుకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ వార్డు నుంచి పురపాలక సంఘం కౌన్సిల్‌లో ముగ్గురు కౌన్సిలర్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ వార్డు కౌన్సిలర్ కోటి శ్రీకన్య కాగా, 7వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, 12వ వార్డు కౌన్సిలర్ కేతా శ్రీనుల సొంతవార్డు సైతం 8వ వార్డు శాంతినగరమే. ఈ వార్డుకు సంబంధించి సమస్యలను పరిష్కరించటంలో మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దానికి ఉదాహరణ శాంతినగర్‌కు వెళ్లే రహదారి మధ్యలో 10 రోజుల కిత్రం అడ్డంగా మట్టిని వేశారు. ఇప్పటికీ దానిని తొలగించలేదు. వెల్ల నుంచి తాగునీటి పైప్‌లైన్‌ను వేసేందుకు 10 రోజులు కిత్రం శాంతినగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డును తవ్వేసి గుంతలు చేశారు. అక్కడ మట్టిని రోడ్డు మీదనే వదిలేశారు.

విద్యార్థుల ఇక్కట్లు

నిత్యం ఈ కాలనీ నుంచి చిన్నారులతో పాఠశాలలకు ఆటోలు వెళుతుంటాయి. మోటారు సైకిళ్లు, కార్లు, ఆటోలు ఇలా అన్ని రకాల వాహనాలు వెళుతుంటాయి. ఇలా మట్టిని వేయటంతో కాలనీలోకి స్కూల్ ఆటోలు వెళ్లకపోవటంతో విద్యార్థులు నడుచుకుంటూ రోడ్డు వద్దకు రావాల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయి. ఇలా మట్టిని రోడ్డు మీదనే వేయటంతో విద్యార్థులతో వచ్చే ఆటోలు ప్రమాదకరంగా ఒరిగిపోతూ వెళ్లాల్సి వస్తోంది. పక్కనే పెద్ద డ్రైన్ ఉంది. 10 రోజులు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోగా తవ్వేసిన మట్టిని అలాగే రోడ్డుకు అడ్డంగా ఉంచేయడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికంగా ఉన్న కౌన్సిలర్‌లు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొడుతున్న వాహనాలు

ప్రధాన రహదారిలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో కొంతకాలం క్రితం రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఎలక్ట్రికల్ పోల్‌ను గుద్దేసింది. దీంతో పోల్ విరిగిపోయింది. ఈ సంఘటన జరిగి నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు ఆ స్తంభాన్ని సరిచేయలేదు. సరికదా విరిగిపోయిన స్తంభాన్ని డివైడర్ దిమ్మలకు కట్టేసి ఉంచారు. రోడ్డు టర్నింగ్‌లో ఇలా డివైడరుకు కట్టిన స్తంభం ఊడిపోయి రోడ్డు మీదకు వస్తే మరింత ప్రమాదం. దీనికి తోడు మున్సిపాలిటీ నిధులతో వేసిన స్తంభాలను ఢీకొట్టి వాహనాలు వెళ్లిపోతున్నా అధికారులు వారి మీద చర్యలు తీసుకోకపోవటం శోచనీయమని పట్టణ వాసులు అంటున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్ల మీదనే ఇసుక, కంకర గుట్టలు వేస్తూ వాహన దారులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. స్థానికులు ఫిర్యాదులు చేసినా సంబంధిత వార్డు సచివాలయాల ఉద్యోగులు గానీ, మున్సిపాలిటీ అధికారులు గానీ చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్



ద్రాక్షారామలో ప్రజలకు తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కె.గంగవరం: మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై రెండు రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామాల్లోని ఊరు ప్రారంభం, చివర్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శులే స్వయంగా పారిశుధ్య కార్మికులతో కలిసి ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించారు. ప్రజలు పారిశుధ్యంపై అవగాహన పెంచుకొని తడి,పొడి చెత్తను వేరు వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని అముజూరు సీనియర్ కార్యదర్శి కంటిపూడి దుర్గాప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని 25 పంచాయతీల పరిధిలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింటి నుంచి చెత్త సేకరణపై పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రెండు రోజుల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈఓపీఆర్డీ సెలత్‌రాజు, డీపీఆర్‌సీ రిసోర్సు పర్సన్ భీమేశ్వరి, ఆయా పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అముజూరులో పారిశుధ్య కార్మికుల ద్వారా చెత్తను సేకరిస్తున్న కార్యదర్శి దుర్గాప్రసాద్

కపిలేశ్వరపురం: వల్లూరు, అంగర గ్రామాల్లో ఆదివారం పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా గ్రామాల సచివాలయాల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, వైద్యారోగ్య, ఆశా కార్యకర్తలు గ్రామాల వీధుల్లో చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసే పద్ధతులపై నివాసితులకు అవగాహన కల్పించారు.

వైభవంగా నాగాభరణ ధారణ మహోత్సవం

రామచంద్రపురం: బాలా త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వర స్వామికి రజిత జటాజూట నాగాభరణ ధారణ మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. లక్ష బిల్వార్చన పూజను కమిటీ నిర్వాహకులు బ్రహ్మశ్రీ ఇంద్రగంటి విశ్వనాథ శర్మ, పొక్కులూరి తిరుమలరావుల పర్యవేక్షణలో వేద పండితులు బ్రహ్మశ్రీ పైడిమర్రి సుబ్రహ్మణ్యం, కొండూరి శ్రీనివాస్, గరిగిపాటి మధు, చీమలకొండ వినోద్ ఆధ్వర్యంలో స్వామి వారికి నాగాభరణ ధారణ గావించారు. భక్తులు సమకూర్చిన సుమారు రూ. 4 లక్షల విలువైన ఆభరణానికి తొలుత గణపతి పూజ, పుణ్యాహవచనం జరిపి మహా సంప్రోక్షణ చేశారు. అనంతరం అగస్త్యేశ్వర స్వామికి ఏకవారాభిషేకం, బిల్వార్చన, గణపతి హోమం, రుద్ర హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొత్తలంక సతీష్, కొత్తలంక ఎర్రయ్య శాస్త్రి, 23వ వార్డు కౌన్సిలర్ సాయి ప్రసాద్ వాడ్రేవు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రజిత జటాజూట నాగా భరణంతో అలంకృతులైన స్వామివారు

వచ్చే నెల 4 నుంచి అఖండ భగవన్నామ సంకీర్తన



ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద సమావేశంలో మాట్లాడుతున్న సతార్ స్వామి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వచ్చే నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న అఖండ భగవన్నామ సంకీర్తన కార్యక్రమానికి సన్నాహక సమావేశం ఆదివారం భీమేశ్వరాలయ ప్రాంగణంలో నిర్వహించారు. అఖిల భారత ప్రాచీన తెలుగు జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ(సతార్ స్వామి) అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ హిందూ ధర్మ ప్రచార కర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో గత 9 సంవత్సరాలుగా ఈ అఖండ భగవన్నామ సంకీర్తన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అఖిల భారత ప్రాచీన తెలుగు జానపద వృత్తి కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు పులిమామిడి యాదగిరి నేతృత్వంలో జరుగుతున్న అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొనేందుకు నూతన భజన బృందాల పేర్ల నమోదు కార్యక్రమాన్ని తిరుపతి నుంచి విచ్చేసిన సంఘం సెంట్రల్ కార్యాలయ కార్యదర్శి గుమాస రవితేజ చేపట్టారు. కార్యక్రమంలో సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు వెంకట సుబ్బారావు, కె.గంగవరం మండల అధ్యక్షుడు మేడిశెట్టి సత్యనారాయణ, రాయవరం మండల అధ్యక్షుడు కుడుపూడి రాంబాబు, గరగ బాబూరావు, ఏడునూతుల మురళి, అక్కిరెడ్డి లక్ష్మణరావు, కటారపు సత్యనారాయణ, 70 భజన బృందాల టీం లీడర్‌లు పాల్గొన్నారు.

శివ పార్వతుల ఏకపీఠం.. పలివెల క్షేత్రం

కొత్తపేట: జిల్లాలో పురాణ ప్రసిద్ధి చెందిన శివాలయాల్లో కొత్తపేట మండలం పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి క్షేత్రం ఒకటి. అగస్త్యేశ్వర మహాముని కోరిన మేరకు శివపార్వతులు ఏకపీఠంపై కొలువుదీరడం ఈ క్షేత్రంలో ఒక విశేషం. పరమశివుని మహా భక్తుడైన పూజారి ప్రాణాలు నిలిపేందుకు శివుడు కొప్పు ధరించిన వైనం మరో విశేషం. అందుకే ఈ క్షేత్రంలో శివలింగానికి ముందు భాగంలో కొప్పు వుంటుంది. ఈ క్షేత్రంలో మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఆ మేరకు జిల్లా దేవదాయ-ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో దేవస్థానం ఈఓ సోమాల శివ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం నుంచి ఈ నెల 28 వరకూ శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. 6 రోజుల పాటు పాంచాహ్నిక ధ్వజారోహణ దీక్షతో దివ్య కల్యాణ మహో త్సవాలు వైభవంగా జరగనున్నాయి.

నేటి నుంచి కల్యాణోత్సవాలు

ఉమా కొప్పేశ్వరుల కల్యాణ మహోత్సవాలు, శివరాత్రి ఉత్సవాలు ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమవుతాయి. అంకురార్పణ, ధ్వజారోహణ, గ్రామోత్సవం జరుగుతాయి. ఆదివారం రాత్రి 4.45 గంటలకు (తెల్లవారితే సోమవారం) స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆగమశాస్త్ర పండితులతో వైభవంగా నిర్వహిస్తారు. 24, 25 తేదీల్లో వివిధ ప్రత్యేక పూజలు, విశేషార్చనలు, కుంకుమ పూజలు జరుపుతారు. 26న మహాశి వరాత్రి సందర్భంగా తెల్లవారుజామున స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం 2.45 గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుంది. 27న త్రిశూల స్నానం, 28న శ్రీపుష్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. కోలాటం, కూచిపూడి వంటి సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అయినవిల్లిలో సుదర్శన హోమం

అయినవిల్లి: అయినవిల్లిలో కొలువైన సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో ఆదివారం సుదర్శన హో మం నిర్వహించారు. ఆలయ అర్చకులు లక్ష్మణచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు ఈ పూజ నిర్వహించారు. స్వామికి విశేష పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకులు వాసర్ల వీవీ సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో ఈ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విశిష్ట సంఖ్యతో లాభాలెన్నో..!

- రైతుసేవా కేంద్రాల్లో నమోదు
- నేటితో ముగుస్తున్న గడువు



ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తున్న వ్యవసాయాధికారులు

రాయవరం: ఆధార్ తరహాలో ప్రతి రైతుకు 14 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు సంఖ్య(యూనిక్ కోడ్) కేటాయించే ప్రక్రియ రైతుసేవా కేంద్రాల్లో కొనసాగుతోంది. రైతులకు యూనిక్ కోడ్ జారీ ప్రక్రియ ప్రారంభమైంది. తొలుత పీఎం కిసాన్ లబ్ధిదారులకు ఫార్మర్ రిజిస్ట్రీ చేపడుతున్నారు. అనంతరం రైతులు, కౌలు రైతులకు అందజేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్‌లో రైతుల వివరాలు నమోదు చేశాకనే ఈ నంబరు జారీ చేస్తారు.

బహుళ ప్రయోజనాలు

రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని పథకాలను ఈ యూనిక్ కోడ్‌తో అనుసంధానిస్తారు. ఈ కోడ్ నంబరును యూనిఫైడ్ ల్యాండ్ ఏపీఐ, ఆధార్ బేస్డ్ అథంటికేషన్, పీఎం కిసాన్ తదితర పథకాలకు అనుసంధానిస్తారు. కౌలు రైతులతో పాటు భూమిలేని కూలీలు సైతం ఆధార్ నంబర్ల ఆధారంగా పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఈ ఐడీ నంబరును ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లింకుతో కూడిన ఆర్థిక పరమైన సేవలను పొందే వీలుంటుంది. దీని సాయంతో దేశంలో ఎక్కడ నుంచైనా అన్నదాతలు రుణఅర్హత, రుణ బకాయిలు, ప్రభుత్వ పథకాల లబ్ధి, జమ తదితర వివరాలను సులభంగా తెలుసుకునే వీలుంటుంది. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య రైతులకు ఎంతో ఉపయుక్తమని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ గడువు సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో రైతులు త్వరితగతిన నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో..

క్లస్టర్ పరిధిలో రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాలున్నాయి. ఈ మండలాల పరిధిలో 91 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ప్రస్తుతం రబీ వరి సాగును చేపడుతున్నారు. క్లస్టర్ పరిధిలో 33,614 మంది రైతులు పీఎం కిసాన్ పథకంలో లబ్ధిదారులుగా ఉన్నారు. అయితే వీరిలో ఇప్పటి వరకు 24,600 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్నారు. ఇంకా 9,014 మంది రైతులు నమోదు చేయించుకోవాల్సి ఉంది. ఈ నెల 24 తుది గడువుగా వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. త్వరిత గతిన నమోదు చేయించుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఈ గడువును ఇంకా పెంచాల్సిందిగా రైతులు పేర్కొంటున్నారు.

క్లస్టర్ పరిధిలో పీఎం కిసాన్ పథకంలో రైతుల నమోదు ఇలా

మండలం	పీఎం కిసాన్ లబ్ధిదారులు	నమోదు సంఖ్య
కపిలేశ్వరపురం	7,588	6,715
కె.గంగవరం	7,783	4,951
రామచంద్రపురం	7,311	4,636
రాయవరం	5,043	4,349
మండపేట	5,889	3,949

పంట పొలాలపై పందుల దాడి



తర్లంపూడి పంట పొలాల్లో చొరబడి వరి మొక్కలు తింటున్న పందులు

కాజులూరు: మండలంలోని తర్లంపూడిలో పందుల స్వైర విహారం రోజురోజుకూ అధికమవుతోంది. నిన్నమొన్నటి వరకూ గ్రామ వీధులు, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో యథేచ్ఛగా సంచరిస్తూ పరిసరాలను అస్తవ్యస్తం చేస్తున్న పందులు తాజాగా పంట పొలాలపైనా దాడి చేస్తుండటంతో పరిసర పొలాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దాళ్వాలో సాగునీటి ఎద్దడి కారణంగా పొలాల్లో నీరు తక్కువగా ఉంటుంది. దీంతో పందులు పొలాల్లో సంచరిస్తున్నాయి. పొలం మధ్యలోకి వెళ్లి చిగుర్లు వేస్తున్న వరి మొక్కలను కొరికి తింటున్నాయి. ఈ క్రమంలో పొలాన్ని సైతం తొక్కి చిందర వందర చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. పందులను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ముగిసిన విజయదుర్గ జాతర

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవిజయదుర్గ అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మూడు రోజులు పాటు నిర్వహించిన ఉత్సవాల్లో అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఆలయ పూజారి కొలువుల మల్లికార్జునరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చివరిరోజైన ఆదివారం అమ్మవారికి భక్తులు నైవేద్యాన్ని సమర్పించారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన ఇరు గ్రామాల భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

లారీ యజమానుల నూతన కార్యవర్గం ఏర్పాటు



లారీ అసోసియేషన్ నూతన కమిటీ

మండపేట: శ్రీ బాలాజీ లారీ యజమానుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఏడిద రోడ్డులో ఆదివారం అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా గుమ్మళ్ల శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా నామాల శేషారావు, కార్యదర్శిగా కోట రాంబాబును ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శిగా దంగేటి వెంకట నాగేశ్వరరావు, కోశాధికారులుగా మల్లికార్జునరావు, ఎంవీఎస్ రాజులు నియమితులయ్యారు. గౌరవ సలహా దారులుగా నాగులపల్లి ఈశ్వరరావు, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, ఈదర దుర్గారావును ఎన్నుకున్నట్టు సంఘ సభ్యులు తెలిపారు.

ఆకట్టుకున్న మహా భారత యుద్ధం



మహా భారత యుద్ధం సన్నివేశంలో దుర్యోధనుడి పాత్రలో న్యాయవాది రమేష్

రాజోలు: వీరభద్రస్వామి, అయ్యప్ప స్వామి వారి ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. గణపతి హోమంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన కార్తికేయ నృత్య ప్రదర్శన, భరతనాట్యం ప్రదర్శన చేశారు. అలాగే న్యాయవాది యాలంగి రమేష్ ప్రదర్శించిన ‘మహా భారత యుద్ధం’ సన్నివేశంలో దుర్యోధనుడి పాత్ర భక్తులను ఆకట్టుకుంది. అనంతరం బాలనాగమ్మలోని మాయల ఫకీర్ ఏక పాత్రాభినయంతో అలరించారు. సాంఘిక, పౌరాణిక నాటకాలు ప్రదర్శించే నటులతో పాటు వాటిని వీక్షించే వారు కూడా తగ్గిపోతున్నారని, అందుకే స్టేజీపై ప్రదర్శనలు చేసి నాటి కళలను భావి తరాలకు చూపిస్తున్నాని న్యాయవాది రమేష్ వివరించారు. దుర్యోధన, మాయల ఫకీర్ పాత్రలు ప్రదర్శించిన రమేష్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు.

వైభవంగా విక్రమ భట్టీశ్వరుని కల్యాణం



ఆలమూరులో వేంచేసిన విక్రమ భట్టీశ్వరస్వామి

ఆలమూరు: దక్షిణ భారతదేశంలో ప్రఖ్యాతి గాంచిన పార్వతీ సమేత విక్రమ భట్టీశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. స్థానిక ఆలయ ఆవరణలోని మండపంలో దేవతామూర్తుల విగ్రహాలను నెలకొల్పి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ పురోహితుల బృందం శైవాగమ పద్ధతిలో ఈ కల్యాణాన్ని నిర్వహించింది. ఉత్సవమూర్తుల విగ్రహాలను ఉంచి నిర్వహించిన గ్రామోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.